
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఖమ్మం 5
మంగళవారం ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 29, కనిష్ఠం 18 భద్రాద్రి కొత్తగూడెం : గరిష్ఠం 28, కనిష్ఠం 18 బుధవారం, 3 జనవరి 2024


టీకే బజార్ పాఠశాలలో చిన్నారులతో కలిసి కేక్‌కట్‌చేస్తున్న మంత్రి తుమ్మల


(ఫైల్)

అంగన్‌వాడీలా!



- పర్యవేక్షణ లేక కునారిల్లుతున్న కేంద్రాలు
- ఇన్‌చార్జ్ సంక్షేమాధికారులతో ఫలితం శూన్యం
- ఏళ్ల తరబడి ఒకే చోట పాతుకుపోయిన సీడీపీవోలు, సూపర్‌వైజర్లు

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 2: మహిళా శిశు సంరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు పర్యవేక్షణ లేమితో కొట్టుమిట్లాడుతున్నాయి. పట్టింపులేని ఉన్నతాధికారులు, సమయపాలన లేని సిబ్బందితో క్షేత్రస్థాయిలో సరైన సేవలు అందడం లేదు. ప్రభుత్వం పిల్లలకు ఎంతో విలువైన ఆట వస్తువులు, బలవర్ధక ఆహారం అందిస్తున్నా అవి సద్వినియోగం కావడంలేదు. దీనికి తోడుగా జిల్లాలో సంవత్సరాల తరబడి ఒకే పోస్టులో పాతుకుపోయిన అధికారులతో ఆశించిన ఫలితాలు కానరా వడం లేదు. జిల్లా అధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తుండటంతో పూర్తి సమయం వెచ్చించలేకపోతున్నారు.

రెండేళ్లుగా ఇన్‌చార్జ్ సంక్షేమాధికారి..

ఖమ్మం జిల్లాకు రెగ్యూలర్ జిల్లా సంక్షేమ అధికారి(డీడబ్ల్యూవో) నియామకం లేదు. గడిచిన రెండు సంవత్సరాలుగా ఇన్‌చార్జ్ అధికారితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో జిల్లాలో ఉన్న 1840 అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. వాటి పరిష్కారంలో వెనకడుగు కనిపిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు కావాల్సిన పౌష్టికాహార సరుకులు ఈ ఐదేళ్లలో పూర్తి స్థాయిలో అందిన దాఖలాలులేవు. ఎప్పుడు ఏదో ఒక సరుకులు లేకుండానే అబ్ధిదారులకు అంటగడుతున్నారు. పాలు, గుడ్లు, బాలామృతం, నూనె తదితర సరుకుల్లో ఏదోఒకటి లేకుండానే కేంద్రాల నిర్వహణ జరుగుతున్నా అధికారులు తమకేమి పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు.

ఐదేళ్లుగా కదలని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు

ఏడు అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో దీర్ఘకాలంగా పలువురు సీడీపీవోలు ఒకే చోట పనిచేస్తున్నారు. సూపర్‌వైజర్లు, సీడీపీవోలు స్థాన చలనం లేక సుమారు ఐదేళ్ల కాలం అవుతుంది. సుదీర్ఘకాలంగా బదిలీలు కాకపోవడం, ఒకవేళ అయినా కూడా పలుకుబడితో ఒకేచోట పాతుకు పోయారు. ఇలాంటి అధికారుల వల్ల కేంద్రాలకు సమయానికి సరుకులు అందడం లేదు. కాగా అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లకు అదనపు బాధ్యత లు అప్పగిస్తున్నారు. వచ్చే అరకొర వేతనానికి తోడుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతో కష్టాలు తప్పడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే నెలల తరబడి కేంద్రాలకు దూరంగా ఉండాల్సి వస్తుంది. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో 10,595 మంది గర్భిణులు, 8,455 మంది బాలింతలు, 85,879 మంది పిల్లలు నమోదయ్యారు. వీరి సంఖ్య ఎప్పటకప్పుడు పెరుగుతోంది. అయితే ఈ అంశంపై రిపోర్టులు రాష్ట్రస్థాయికి అందడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఇతర పనులతో కేంద్రం మూత

ప్రధాన అంగన్‌వాడీలుగా మినీ కేంద్రాల స్థాయి పెంపుతో లబ్ధిదారులకు మరిన్ని సేవలు అందనున్నాయి. ఇప్పటి వరకు కేవలం ఒక టీచర్ మాత్రమే ఉండటంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడానికే సమయం సరిపోయేది. పిల్లలతో ఎక్కువ గడిపే అవకాశం రావడం లేదు. ప్రభుత్వం చేపట్టే వివిధ సర్వేలు, కార్యక్రమాల్లో పాల్గొనాలంటే కేంద్రాన్ని మూసి వేయాల్సిన పరిస్థితి నెలకొంది.




దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోండి

- ప్రజాపాలన సభలో మంత్రి తుమ్మల
- ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులతో కలిసి న్యూఇయర్ వేడుకలు

ఖమ్మం, జనవరి 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రవ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలోని 27, 28 డివిజన్లలో జరిగిన ప్రజాపాలన సభల్లో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల మేనిఫేస్టోలో ప్రకటించిన ఆరుగ్యారంటీల పథకాల ప్రయోజనాలను ప్రజలకు అందించండంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని, పథకాల అమల్లో ఎలాంటి అవతవకలు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. నిరుపేదలకు అర్హతమేరకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు ప్రధాన గ్యారంటీ పథకాలను అమలు చేశామని, మిగిలిన పథకాలను కూడా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని, అందులో భాగంగానే దరఖాస్తులు తీసుకుంటున్నారని, ఇందిరమ్మ రాజ్యంలో అంతా సుఖసంతోషాలతో ఉండాలన్నదే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ ఆదర్శసురభి, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, గజ్జెల లక్ష్మి, కమర్తపు మురళి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, సాధురమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు 42వడివిజన్‌లోని టీకే బజార్‌లో ప్రాథమిక పాఠశాలలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో మంత్రి తుమ్మల చిన్నారులతో కలిసి కేక్‌కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపి.. నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో ప్రతీ మండలానికి ఒక రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుచేయబోతున్నామని తుమ్మల వెల్లడించారు.

వ్యవసాయక్షేత్రంలో తుమ్మల...

దమ్మపేట: వ్యవసాయాన్ని ఎంతో ప్రేమించే వ్యక్తిగా.. పలు పంటల సాగుతో తోటి రైతులకు ఆదర్శంగా నిలిచిన తుమ్మల నాగేశ్వరరావు తన వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం సాయంత్రం పరిశీలించారు. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి దమ్మపేట మండలంలోని లింగాలపల్లి, గండుగులపల్లిలోని తన వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. పామాయిల్, మామిడితోటల్లో పర్యటించి పంటల యాజమాన్య చర్యలను పరిశీలించారు. ఆయన గండుగులపల్లి వ్యవసాయక్షేత్రానికి వచ్చిన విషయం తెలుసుకుని రైతులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు భారీగా అక్కడికి చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి అయిన తర్వాత వచ్చిన తుమ్మలకు వారు శుభాకాంక్షలు తెలపగా.. వారిని పేరుపేరునా పలకరించిన తుమ్మల పామాయిల్, తదితర పంటల యాజమాన్య చర్యలపై పలు సూచనలు చేశారు.

'సీతారామ'పై నేడు మంత్రి తుమ్మల సమీక్ష

అశ్వారావుపేట: సీతారామ ప్రాజెక్టుపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సమీక్షించనున్నారు. ఉదయం 10గంటలకు సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాగమయి జరిపే పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న తరువాత తుమ్మల మధ్యాహ్నం 2.30గంటలకు సీతారామ ప్రాజెక్టు ఎత్తి పోతలపథకం పంపు హౌస్ పనులను పరిశీలిస్తారు. అనంతరం గండుగులపల్లిలో సీతారామ ప్రాజెక్టు పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.


పామాయిల్ తోటలో తుమ్మల

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ప్రజాపాలన సభలో మంత్రి పొంగులేటి
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు


ప్రజాపాలన గ్రామసభలో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం, జనవరి 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, అలాగే ప్రైవేటు వ్యక్తుల వద్ద ప్రభుత్వ స్థలాలు ఉంటే వాటిని తిరిగి తీసుకుంటామని, ఇలాంటి స్థలాలను ఆక్రమించుకున్న వారెవరైనా ఉంటే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అందించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌హాల్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని, రూ.6.70లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రం చిన్నాభిన్నమైందని, విద్యుత్ సంస్థలు అప్పుల్లో కూరకుపోయాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అలాంటి అక్రమార్కులను కఠినంగా శిక్షిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరుగ్యారంటీల అమలుపై తొలి కేబినేట్‌భేటీలోనే తీర్మానం చేశామని, రాష్ట్రం ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. రాష్ట్ర సంపద పెంచాచమని చెబుతున్న బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో సమాధానం చెప్పలేకపోయారని, ప్రజలను అన్నిరకాలుగా మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్ని అమలుచేయడంతోపాటు అన్నీవర్గాల ప్రజలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషిచేస్తుందని, ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతుందని, అందులో భాగంగా అర్హులందరికీ త్వరలోనే ఇళ్లస్థలాలు ఇస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన, ప్రజాస్వామ్యపాలన రావడంలో మీడియా కీలకంగా పనిచేసిందని, మార్పుకోసం జర్నలిస్టులు కూడా తమవంతు పనిచేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టుల పట్ల సానుకూలంగా ఉన్నారని, హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు అందిస్తామన్నారు. ఇక ఖమ్మం జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం గత ప్రభుత్వం కేటాయించిన భూమి రేటును కూడా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సమాచారాశాఖను పాలనాపర మార్పులు చేస్తామని, ఖమ్మంలో సమాచారశాఖకు అన్ని వసతులు కలిపిస్తామని, అవసరమైతే డీడీ హోదాను కల్పించి సేవలను విస్తృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీగా బలరాం

- ప్రతిభకు పట్టం కట్టిన ప్రభుత్వం
- నియామకం పట్ల కార్మికుల హర్షం


చైర్మన్‌గా నియమితులైన బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 2: సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్. బలరాంను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. డైరెక్టర్ (పా)గా విధులు నిర్వహిస్తున్న బలరాంకు సీఎండీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. సింగరేణి సంస్థలో దీర్ఘకాలంగా చైర్మన్‌గా పని చేస్తున్న ఎన్.శ్రీధర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. తెలంగాణలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సంస్థ రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో 11 ఏరియాల్లో విస్తరించి ఉంది. సుమారు 40వేల మంది సింగరేణి పర్మినెంట్ ఉద్యోగులు సంస్థలో పని చేస్తుండగా సుమారు 26వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. నూతనంగా చైర్మన్‌గా నియమితులైన బలరాం సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తారని కార్మికులు ఆకాంక్షిస్తున్నారు. నూతన చైర్మన్‌గా నియమి తులైన బలరాంపై అనేక బాధ్యతలు ఉన్నాయి. ఇప్పటికే సింగరేణి సంస్థలోని కోయగూడెం, సత్తుపల్లి, శ్రావణపల్లి, శాంతిగని, ఓపెన్‌కాస్టులను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర బొగ్గుమంత్రిత్వశాఖ టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. దీంతో సింగరేణిలో నూతన ప్రాజెక్టుల ఏర్పాటు సవాల్‌గా మార నుంది. ఏది ఏమైన డైరెక్టర్ (పా)గా పని చేస్తున్న ప్రభుత్వం అదనపు బాధ్యత లు అప్పచెప్పడం పట్ల కార్మికసంఘాలు, సింగరేణి కార్మికులు, కార్మికసంఘాల ప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఖమ్మం నగరంలోని ఓ పెట్రోల్ బంకులో బారులుతీరిన వాహనదారులు

బంకుల్లో జనం బారులు

- డీజిల్, పెట్రోల్ కోసం వాహనదారుల ఉరుకులు పరుగులు
- డ్రైవర్ల సమ్మె వార్తలతో క్యూ


రద్దీగా ఉన్న పెట్రోల్‌బంకు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 2: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన భారత న్యాయ సంహిత కొత్త చట్టాన్ని నిరసిస్తూ, పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే ట్యాంకర్ల డ్రైవర్లపై చమురు సంస్థలు, డిపో యజమా నులు ఆంక్షలు విధిస్తున్నారని, పెట్రోల్ సరఫరాలో డ్రైవర్లకు వెసులుబాటు కల్పించకుండా ఇష్టారాజ్యంగా నిబంధనలు అమలు చేస్తున్నా రంటూ భారీ వాహనడ్రైవర్లు సమ్మెకు దిగారన్న వార్తలతో జిల్లాలోని పెట్రోలుబంకులు రద్దీగా మారాయి. డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ల డ్రైవర్లు కూడా సమ్మెలో ఉన్నారని, ఫలితంగా పెట్రోలు, డీజిల్ దొరకదన్న ప్రచారం జరుగడంతో మంగళవారం సాయంత్రం జిల్లాలోని పెట్రోలు బంకులకు వాహనదారులు పరుగులు తీశారు. ఈ క్రమంలో కొన్ని పెట్రోలు బంకుల్లో స్టాకు అయిపోగా.. కొన్ని బంకుల్లో వాహనదారుల రద్దీ కారణంగా ఒక్కో వ్యక్తికి రెండు లీటర్ల పెట్రోల్, 15 లీటర్ల డీజిల్ మాత్రమే పోశారని వాహనదారులు వాపోయారు. అయితే మంగళవారం రాత్రి డ్రైవర్లతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని, వారు సమ్మెను విరమించారని తెలియడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

భద్రాద్రికే ఆ ఖ్యాతి

- 8న రామాలయంలో విశ్వరూప సేవ
- ముగిసిన ముక్కోటి అధ్యయనోత్సవాలు
- నేటినుంచి విలాసోత్సవాలు


విశ్వరూప సేవ నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

భద్రాచలం, జనవరి 2: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామక్షేత్రంలో తప్ప మరే క్షేత్రంలో జరగని అరుదైన ఉత్సవం విశ్వరూప సేవ. ఈ ఉత్సవంలో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉన్న అన్ని రకాల ఉత్సవ విగ్రహాలను ఒక చోటకు చేర్చి అలంకరించి ఏకారాధన చేసే విశేషోత్సవం ఇది. వైకుంఠ ఏకాదశి వైభవాన్ని తలపించేలా ఈ ఉత్సవం ప్రభుత్వోత్సవంలో భాగంగా మహాదర్బారు సేవగా నిర్వహిస్తారు. భద్రాద్రి దేవస్థానంలో 8వ తేదీన విశ్వరూపసేవ (సకల దేవతా అలంకారం) నిర్వహించనున్నారు. 24రోజుల పాటు దేవస్థానంలో ఉత్సవాలు జరిగిన అనంతరం 27వ రోజున అంటే వైకుంఠ ఏకాదశికి సరిగ్గా 16వ రోజున ద్వాదశి (జనవరి 8న)రోజు భద్రాద్రి రాముడి సన్నిధిలో విశ్వరూపసేవ నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి తరువాత వచ్చే బహుళ ద్వాదశి ఘడియల్లో నిర్వహించే ఉత్సవాలకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రామాలయంలోని నిత్యకల్యాణ మండప వేదిక వద్ద ఇందుకోసం ప్రత్యేక అలంకరణ ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా విశ్వరూపసేవ సమయంలో స్వామి వారికి సమర్పించే (ప్రత్యేక ప్రసాదం కదంబం)కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది.

ముగిసిన అధ్యయనోత్సవాలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో డిసెంబరు 13నుంచి నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గత నెల 23నుంచి రాపత్తు సేవలు ప్రారంభం కాగా చివరి రోజున పంచాయతీ కార్యాలయంలోని నృసింహదాస మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామికి రాపత్తుసేవ నిర్వహించారు. ముందుగా రామాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామిని అందంగా అలంకరించి పల్లకీలో మేళతాళాలతో పంచాయతీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద నివేదన చేశారు. ఇదిలా ఉండగా భద్రాచలంలో బుధవారం విలాసోత్సవాలు ప్రారంభం కానుండగా బుధవారం దసరా మండపంలో స్వామివారికి విలాసోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో, ప్రత్యేక అధికారి ప్రతీక్‌జైన్, జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి పవన్, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస రావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

దారితప్పిన దిశ

- అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతున్న లక్ష్యం
- ఆధార్ సీడింగ్ అయితేనే ప్రభుత్వ పథకాలని తప్పుడు ప్రచారం


శిక్షణ ఇవ్వకుండానే పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

గుండాల, జనవరి 2: గృహలక్ష్మి సాయం రూ.2,500 అందాలంటే ఆధార్ సీడింగ్ చేసుకోవాలని మహిళలను తప్పుదోవ పట్టించారు. ఈ ప్రచారాన్ని సాక్షాత్తు ప్రభుత్వ అధికారులే చేశారు. ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతపై కనీస పరిజ్ఞానం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్(పీఎంజీ దిశ) అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. పీఎంజీ దిశ లో గ్రామీణ ప్రాంతంలోని 14-60 సంవత్సరాలలోపు స్త్రీ, పురుషులకు పదిరోజుల పాటు రోజుకు రెండు గంటలు ఉచిత కంప్యూటర్ శిక్షణ, డిజిటల్ చెల్లింపులు, స్మార్ట్‌ఫోన్ వినియోగం, సామాజిక మాధ్యమాల వినియోగంపై శిక్షణ కల్పించాలి. 20గంటల శిక్షణ పూర్తి అయ్యాక ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి 8మార్కులు వచ్చిన వారిని ఉత్తీర్ణులుగా గుర్తించి సర్టిఫికెట్ అందజేయాలి. దీనికి గాను ప్రతి అభ్యర్థికి రూ.300 చొప్పున నిర్వాహకులకు ప్రభుత్వం చెల్లిస్తుంది. కాగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సీఎస్‌సీ నిర్వాహకుల ద్వారా గుండాల మండలంలో గత నెల రోజుల నుంచి శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. అయితే అవగాహన కల్పించాల్సిన నిర్వాహకులే దారితప్పారు. మహిళలకు శిక్షణ విషయం తెలియకుండానే కార్యక్రమాన్ని కానిచ్చేశారు. కానీసం మహిళలకు తమ ఆధార్ సీండిగ్ ఎందుకు అడుగుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. మహిళలకు ప్రభుత్వం అందించే రూ.2,500, ప్రభుత్వ రుణాలు రావాలంటే ఆధార్, వేలిముద్రలు, ఐరీష్ నమోదు చేసుకోవాలని గ్రామాల్లో ప్రచారం కావడంతో శిక్షణ విషయం తెలియని మహిళలు కేంద్రాల వద్ద క్యూ కట్టారు. పదిరోజుల క్రితం వేలిముద్రలు ,తర్వాత ఐరీష్ నమోదు చేస్తున్నారు. ఇప్పటికే గుండాల మండలంలోని 20గ్రామాల్లో 2వేల మందికి శిక్షణ ఇవ్వకుండానే ఇచ్చినట్టు నమోదు చేసుకున్నారు. అధికారులను వివరణ కోరగా ముందుగా ప్రభుత్వ పథకాలకోసం ఆధార్ సీడింగ్ చేస్తున్నామన్నారు. తర్వాత తరువాత మాట మార్చారు.

తప్పుడు సమాచారం ఇచ్చారు : క్రాంతికుమార్, ఏపీఎం

శిక్షణ విషయం తెలియదు. ప్రభుత్వ పథకాలకోసం ఆధార్ సీడింగ్ చేస్తున్నామని, తమకు సహకరించాలని సీఎస్‌సీ టీమ్ లీడర్ చెప్పారు. ఈ విషయాన్నే వీవోలకు తెలిపాం. ఉన్నతాధికారులకు విషయం తెలియజేసి శిక్షణ కార్యక్రమం నిర్వహించేల చర్యలు తీసుకుంటాం.

శిక్షణకు రావడం లేదని అలా చెప్పాం: శ్వేత, సీఎస్‌సీ టీమ్‌లీడర్

ఏజెన్సీలో మహిళలు పనులకు వెళ్తున్నారు. శిక్షణ అంటే ఎవరూ ముందుకు రారు. అందుకే ప్రభుత్వ పథకాలకు ఆధార్ సీడింగ్ చేయాలని చెప్పాం.

ఈకేవైసీకి గడువేమీ లేదు

● గ్యాస్ పంపిణీదారులతో డీఎస్వో సమావేశం



డీలర్లతో మాట్లాడుతున్న డీఎస్వో

ఖమ్మం కలెక్టరేట్, జనవరి-2: ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీ నమోదుకు చివరి తేదీ అంటూ లేదని, ప్రతి వినియోగదారునికీ ఈకేవైసీ చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి గంటా శ్రీలత అన్నారు. మంగళవారం జిల్లాలోని గ్యాస్ పంపిణీదారులతో ఆమె సమీక్షించారు. పంపిణీదారులతో ఆమె మాట్లాడుతూ ఎల్పీజీ కనెక్షన్‌కు ఈకేవైసీ నమోదుకు చివరి తేదీ అంటూ ఏమీ లేదని ఇది నిరంతర ప్రక్రియలా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న మహాలక్ష్మీ పథకం ద్వారా రూ.500లకే సిలిండర్‌కు, గ్యాస్ ఈకేవైసీ నమోదు అవసరం లేదని తెలిపారు. పంపిణీ దారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమె విన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాన్ని కల్పించవద్దని ఆమె సూచించారు.

వైరా- నెమలి బస్సు సర్వీసు నడపాలి లేదంటే డిపో ఎదుట ధర్నా చేస్తా..

» మధిర ఆర్టీసీ డీఎంకు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హెచ్చరిక



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న విప్పలమడక సర్పంచ్, మాజీ సర్పంచ్

వైరా, జనవరి 2: వైరా-నెమలి రూట్లో వెంటనే బస్సు సర్వీస్‌లు నడపకపోతే మధిర ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తానని మేనేజర్‌ను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హెచ్చరించారు. ఈ రూట్లో బస్సు సర్వీస్ నడపాలని గత నెల తొమ్మిది నుంచి ఇప్పటివరకు పలుసార్లు ఎమ్మెల్యేగా తాను చెప్పినప్పటికీ ఏమాత్రం ఖాతర్ చేయకపోవడాన్ని రాందాస్‌నాయక్ తీవ్రంగా పరిగణించారు. మండలంలోని విప్పలమడక గ్రామంలో మంగళవారం జరిగిన ప్రజాపాలన వేదిక పైనుంచి మొబైల్ ద్వారా డీఎంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీ స్కీంల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం గతనెల తొమ్మిది నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన వెంటనే ఎంతో కీలకమైన వైరా-నెమలి రూట్లో రద్దయిన బస్సు సర్వీస్‌లను నడపాలని ఈ రూట్ ప్రజలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. డిసెంబరు పదిన వైరాలో మహిళల ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించిన వేదిక పైన కూడా అక్కడే ఉన్న మధిర డీఎంతో వైరా-నెమలి రూట్లో వెంటనే బస్సు సర్వీస్‌లు నడపాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ ఫలితం కన్పించలేదు. ఈ నేపథ్యంలోనే విప్పలమడక ప్రజాపాలనలో పాల్గొన్న ఎమ్మెల్యేకు బస్సు సర్వీస్ విషయమై అక్కడి సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు తుమ్మల జాన్‌పాపయ్య, పారుపల్లి కృష్ణారావు ఒక వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మధిర డీఎంకు ఫోన్ చేసి బస్సు సర్వీస్ విషయమై ప్రశ్నించారు. ఖమ్మం ఆర్ఎంకు ఈ సర్వీస్ విషయమై తెలియజేశానని, కొన్ని సమస్యలున్నాయని తెలిపారు. దాంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్ఎం, డీఎం ఎమ్మెల్యేకు సంబంధించిన విషయం కాదని, ప్రజా సమస్య అని మన ముగ్గురం గదిలో కూర్చోని మాట్లాడుకుంటే సరిపోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ రూట్లో బస్సు సర్వీస్ ప్రారంభించకపోతే అధికార పార్టీకి చెందిన వాడినైనప్పటికీ డిపో ఎదుట ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. డీఎం మాట్లాడుతూ మళ్లీ బస్సు సర్వీస్ గురించి ఆర్ఎం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి ఐక్యంగా పనిచేద్దాం

» ఉద్యోగులతో ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



కేక్ కట్ చేస్తున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, జనవరి 2: గిరిజనుల సంక్షేమం కోసం కలిసికట్టుగా పని చేద్దామని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఐటీడీఏ అధికారులతో అన్నారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపరు. అనంతరం పీవో జైన్ మాట్లాడుతూ గిరిజనుల విద్యాభివృద్ధి కోసం అనేక గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు నెలకొల్పి వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని, నూతన సంవత్సరంలో కొత్త లక్ష్యాలను పెట్టుకొని విద్యాశాఖ అధికారులు పని చేయాలన్నారు. గిరిజనులు వారి పనుల నిమిత్తం ఐటీడీఏ కార్యాలయానికి వచ్చినప్పుడు ఐటీడీఏ కార్యాలయంలో పని చేస్తున్న యూనిట్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వారిని పలకరించి వారిక కావలసిన పనులు చేసి వారి అభినందనలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ఎస్వో సురేష్‌బాబు, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, ఏసీఎంవో రమణయ్య, టీఆర్‌సీవో టి.వెంకటేశ్వరరాజు, ఏటీడీవోలు పాల్గొన్నారు. అనంతరం ఇల్లందు డివిజన్ ఏటీడీవోల పరిధిలోని హెచ్‌ఎం, వార్డెన్‌లతో రాబోయే పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.

ప్రొటోకాల్ రగడపై డీఈవో విచారణ

» ఎమ్మెల్యే రాగమయి ఫిర్యాదుతో పాఠశాలలో హెచ్‌ఎంపై జిల్లా విద్యాశాఖాధికారివిచారణ

» 'పది'లో ఉత్తమ ఫలితాలకు కృషి: డీఈవో



పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న డీఈవో

సత్తుపల్లిరూరల్, జనవరి2: సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి పాఠశాలను ఈనెల 18న ఆకస్మికంగా సందర్శించిన క్రమంలో సదరు హెచ్‌ఎం ప్రోటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యే డీఈవోకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీఈవో సోమశేఖరశర్మ మంగళవారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని పాత సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్‌పై విచారణ నిర్వహించారు. ఈనెల 18న ఎమ్మెల్యే రాగమయి పాఠశాలను సందర్శించిన సందర్భంలో ప్రోటోకాల్ పాటించలేదని, 5రోజుల క్రితం లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారని డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. ఈ క్రమంలో సదరు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యుల నుంచి వేర్వేరుగా లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించగా మరో రెండు రోజుల్లో తీవ్రతను బట్టి చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా స్థానిక పాత సెంటర్ హైస్కూల్‌లోని ఇద్దరు ఉపాధ్యాయులపై ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై కూడా విచారణ నిర్వహిస్తున్నామని డీఈవో తెలిపారు.

జిల్లాలో 'పది' విద్యార్థులు 16,514మంది

డీఈవో ముందుగా ఎన్టీఆర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులతో అభ్యసన సామర్థ్యాలను పర్యవేక్షించారు. జిల్లాలోని 469పాఠశాలలో 16,514మంది విద్యార్థులు ఈ ఏడాది పదీ పరీక్షలు రాయనున్నారని, వందశాతం ఫలితాల సాధన కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా అల్పాహారం కోసం దాతల సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రత్యేకంగా విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల వారీగా అభ్యాస దీపికలు అందించామని, ఉపాధ్యాయులను కూడా సర్దుబాటు చేశామన్నారు. సిలబస్ పూర్తవ్వగా రివిజన్ జరుగుతుందని, ఈసారి 7పేపర్లు ఉంటాయని, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్‌కు వేర్వేరుగా పేపర్లు విద్యార్థులు రాయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బీ.రాములు, హెచ్‌ఎం శైలకుమారి, వీర్ల సరోజిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టర్ అసోసియేషన్‌లో ముసలం

» ఒక్కరి వల్ల రెండున్నరేళ్లుగా అనైక్యత..

» అసోసియేషన్‌కు వ్యతిరేకంగా చర్యలు

» సదరు కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు..

మణుగూరుటౌన్, జనవరి 2: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థ రాష్ట్రంలోని 11 ఏరియాల్లో ఉన్న సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ బలమైన అసోసియేషన్‌గా పేరొందింది. ఏరియాలోని పెద్దపెద్ద కాంట్రాక్టర్‌లతోపాటు మధ్యతర గతి, చిన్న చిన్న పనులు నిర్వహించే కాంట్రాక్టర్‌ల మధ్య నెలకొన్న ఐక్య త ఒకే మాట.. ఒకే బాట అన్నచందంగా కాంట్రా క్టర్‌ల తీరు కొనసాగేది. దీంతో మణుగూరు కాంట్రాక్టర్‌ల అసోసి యేషన్ సింగరేణి సంస్థలో ఓ ప్రత్యేకత స్థానాన్ని సంపాదించుకుంది. కాగా రెండో దఫా రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం, గుర్తింపు కార్మిక సంఘంగా టీబీజీకేఎస్ ఉండడంతో బీఆర్ఎస్‌లో మండల స్థాయి కమిటీ ప్రాముఖ్యతగల బాధ్యతలను నాటి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సదరు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీంతో ఆ కాంట్రాక్టర్ తనకు మాజీ ఎ మ్మెల్యే వద్ద ప్రత్యేకమైన పలుకుబడి ఉందంటూ.. గుర్తింపు కార్మిక సంఘంగా మా యూనియనే ఉందన్న భరోసాతో అసోసియేషన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇ ష్టానుసారంగా వ్యవహరించడం.. అసోసియేషన్ నిర్ణయాలను వ్యతిరేకించడం పరిపాటిగా మారిందని పలువురు కాంట్రాక్టర్‌లు వాపోయారు.. దీంతో రెండేళ్లుగా కాంట్రాక్టర్‌ల అసోసియేషన్ ఐక్యతను కోల్పోయి ఎవరికి వారే అన్న చందంగా వ్యవహరించడంతో అసోసియేషన్ ముక్కలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మరల ఇటీవల సదరు కాంట్రాక్టర్ చేస్తున్న వ్యతిరేఖ పనులతో ఏరియా సింగరేణి అధికారులు, కాంట్రాక్టర్‌లు విసిగిపోయానట్లు తెలుస్తోంది. తోటి కాంట్రాక్టర్ ఉపాధిపై కొట్టకూడదనే నిర్ణయానికి వచ్చిన మిగతా కాంట్రాక్టర్‌లు మాజీ అసోసియేషన్ సభ్యులతో కలసి మణుగూరు డీఎస్పీ రాఘవేందరరావును ఆశ్రయించగా.. డీఎస్పీ సూచన మేరకు పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమాకాంత్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన సీఐ రమాకాంత్ విచారణ చేపడతామని తెలిపినట్లు ఏరియా కాంట్రక్టర్ లు తెలిపారు. ఈ విషయమై వివరణ కోరేందుకు కాంట్రాక్టర్ అసోసియేషన్ మాజీ సభ్యులకు, అధ్యక్షున్ని ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



డీఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లు

'ఐలూ' క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి

ఖమ్మం లీగల్, జనవరి 2: ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.ఎస్. జగ్జీవన్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు, ఐలు జాతీయ వైస్ ప్రెసిడెంట్ కొల్లి సత్యనారాయణ, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, మందడపు శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, తన్నీరు పాపయ్య, ఆకుల శేఖర్‌బాబు, వెంకటేశ్వర్లు, వి.లక్ష్మీనారాయణ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుబల్లి, జనవరి 2: కోడిపందాల స్థావరాలపై ఒక వ్యక్తిని, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు వీఎంబంజర్ ఎస్ఐ సూరజ్ తెలిపారు. మంగళవారం 'జూదం జోరు...పందాల హోరు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన పోలీసులు మండలంలోని టేకులపల్లిలో కోడిపందాల స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తి పట్టుబడగా మరికొంతమంది పరారయ్యారని, అక్కడ పందాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉం చి న రెండు కోడి పుంజులు, కోడి కత్తులు, తొమ్మిది ద్విచక్రవాహనాలు, రూ.10వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. పరారైన వారి కోసం గాలిస్తున్నామని వివరించారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

గుండాల, జనవరి 2: ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకోని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గుండాల మండల కేంద్రానికి చెందిన తాటి ప్రభాకర్ (30) మంగళవారం రాత్రి రోళ్లగడ్డ వెళ్లివస్తున్నాడు ఈ క్రమంలోనే లింగగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తీసుకోని గుండాల వస్తుండగా రోళ్లగడ్డ సమీపంలోకి రాగానే డీజీల్ అయిపోవడంతో రోడ్డుపై నిలిపాడు. రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ గమనించకుండా వేగంగా వచ్చి వెనుకనుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గుండాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్‌డ్రైవర్ దుర్మరణం

తల్లాడ, జనవరి 2: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాన్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈసంఘటన మంగళవారం రాత్రి తల్లాడ మండలం రెడ్డిగూడెం వద్ద చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు కొబ్బరికాయల లోడుతో ఓ వ్యాన్ వెళ్తోంది. అదే సమయంలో ఖమ్మం నుంచి తల్లాడ వైపు ఓ లారీ వస్తోంది. రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి కళాశాల సమీపంలోకి రాగానే ఇవి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో వ్యాన్ డ్రైవర్ సుబ్బు(46) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. లారీ ఢీకొన్న తీరుకు. అతడి మృత దేహం వ్యాన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయింది. రెండు చేతులు తెగిపడ్డాయి. క్యాబిన్‌లో ఇ రుక్కుపోయిన అతడిని పోలీసులు ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీశారు. ఈ ప్రమాదం వల్ల తల్లాడ-వరంగల్ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచాయి. ఎస్ఐ సురేష్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

'పరిహారం చెల్లింపు'లో అక్రమాలు జరిగాయని
మంత్రి పొంగులేటికి ఫిర్యాదు

తిరుమలాయపాలెం జనవరి 2: మండలంలోని బీరోలు గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోయిన రైతుల భూములకు పరిహారం చెల్లింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలిసి ఫిర్యాదుచేశారు. బీరోలు గ్రామ రెవెన్యూ పరిధిలో 370 ఎకరాల భూమిని కాలువ కోసం సేకరించారు. ఆ కాలువ అండర్‌గ్రౌండ్ నుంచి వెళుతుంది. గత ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వారి అనుచరులకు ఉద్దేశపూర్వకంగా 50 ఎకరాల భూమికి సుమారు రూ.9 కోట్లు వారికి అందజేశారని పేర్కొన్నారు. అలాగే ఆ భూమిలో లేని బావులు, బోర్లు ఉన్నట్లు సృష్టించి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీహెచ్ ఉపేందర్, ఎస్‌కె.జానీబాబు, చాగంటి వెంకన్న, కొప్పుల రాము, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ బోర్ తొలగించిన వ్యక్తిపై ఫిర్యాదు

ముదిగొండ, జనవరి 2: ముదిగొండ ఆరోవార్డులో ప్రజల సౌకర్యార్థం వేసిన మంచినీటి బోర్‌ను ఓ వ్యక్తి తొలగించాడని మంగళవారం గ్రామపంచా యతీ కార్యదర్శికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సైదులు అనే వ్యక్తి వీధిలో వేసి బోరింగ్ పంపును జేసీబీ సహాయంతో తొలగించాడు. దీంతో ఆవీధిలో ఉండే ప్రజలు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

డీజే వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

నేలకొండపల్లి, జనవరి 2: కోదాడ వైపు నుంచి వస్తున్న డీజే వాహనాన్ని పెట్రోలు బంకు సమీపంలో టిప్పర్ ఢీకొనటంతో డీజే వాహనం పల్టీలు కొట్టింది. వాహనంలో ఉన్న వ్యక్తులకు ఎటువంటి ప్రమాదం జరుగక పోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల ప్రకారం మంత్రి పొంగులేటి మంగాపురంతండాలో జరిగిన ప్రజాపాలన సభలో పాల్గొని తిరిగి వెళుతుండగా కాన్వాయ్‌ను తప్పించబోయి డీజే వాహనం పక్కకు రాగా వెనుక నుంచి ఓవర్‌టేక్ చేయబోయిన టిప్పర్ ఢీకొట్టింది. దీంతో టిప్పర్ పల్టీ కొట్టింది. ఎటువంటి ప్రమాదం జరగక పోవటంతో పెను ప్రమాదం తప్పినట్లైంది.

పేకాట శిబిరంపై దాడులు

అశ్వారావుపేట రూరల్, జనవరి 2: మండలంలోని నారాయణపురంలో నిర్వహించిన పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడులు జరిపారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం నారాయణపురంలో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.5200 నగదును స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యశాఖలో అక్రమ నియామకంపై ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు



పీవోకు ఫిర్యాదుచేస్తున్న గిరిజన సంఘాలు

భద్రాచలం, జనవరి 2: వైద్యశాఖలో అక్రమ నియామకంపై ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్‌కు గిరిజన సంఘాల నా యకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. అన్నపురెడ్డి మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉండగా ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వైద్య ఆరోగ్యశాఖ గత సంచాలకులు జి.శ్రీనివాస్ తన సమీప బంధువుకు ఉద్యోగం ఇచ్చి బంధుప్రీతి చాటారని వారు ఆరోపించారు. జిల్లా సెలక్షన్ కమిటీ ఆమోదం లేకుండా బహిరంగ నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగ అవకాశం కల్పించడాన్ని వారు విమర్శిస్తున్నారు. అప్పటి సంచాలకుల ఆదేశాలతో డీఎంహెచ్‌వో నోట్‌ఫైల్ ద్వారా గిరిజనేతరురాలైన ఓ మహిళకు ఏఎన్‌ఎం ఉద్యోగం ఇచ్చారని వారు ఆరోపించారు. ప్రస్తుతం ఆమె సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు డిప్యుటేషన్ వేయించుకొని విధులు నిర్వహిస్తున్నట్లు వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని వారు పీవోను కోరారు. పీవోకు ఫిర్యాదు చేసిన వారిలో గోండ్వాన సంక్షేమపరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పా యం సత్యనారాయన, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కొమరం బుచ్చయ్య, విద్యార్థి రాష్ట్ర కన్వీనరు ప్రకాష్, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్‌నాయక్, జిల్లా అధ్యక్షులు కేశవ్‌నాయక్, కుశ నాయక్, పూనెం కృష్ణ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

» ప్రభుత్వానికి ఉద్యమకారుల వినతి » ఖమ్మంలో అమరవీరుల స్తూపం వద్ద ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమనాయకులు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 2: తెలంగాణా ఉద్యమకారులను ప్రభుత్వ ఆదుకోవాలని,వారి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని తెలంగాణా ఉద్యమనాయకులు కోరారు. మంగళవారం నగరంలోని మయూరిసెంటర్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విద్యార్థి ఉద్యమ నాయకులు రడం సురేష్ గౌడ్, లింగనబోయిన సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. తెలం గాణ ఉద్యమంలో కేసుల పాలై జైలు జీవితం గడిపిన అన్ని రాజకీయ పార్టీల విద్యార్థి, యువజన, మహిళ, ఉద్యోగ, ఉపాధ్యా య, న్యాయవాద, ప్రజాసంఘాల, కుల సంఘాలలో పనిచేసిన వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కేసులు పాలై, జైలు శిక్ష అనుభవించినటువంటి ఉద్యమకారులకు తెలంగాణ ప్రభుత్వం 250 చదరపు గజాల ఇంటిస్థలం ఇస్తున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాబోయే కాలంలో ఉద్యమకారుల న్యాయబద్ధమైన కోరికలను నెరవేర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయాలని తెలంగాణ ఉద్యమకారులందరూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు 25 వేల రూపాయల పెన్షన్ ఇస్తామని ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో వ్యక్తిగత జీవితాలను, కుటుంబాన్ని వదిలి నిస్వార్థంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అనేక రోజులు జైలు జీవితం గడిపిన ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలన్నారు. ప్రతి ఉద్యమకారుడికి కేటాయించిన 250గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేస్తామనటం గొప్ప విషయమన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కూరపాటి రంగరాజు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు షేక్ ఖాజా మియా, న్యాయవాద జేఏసీ చైర్మన్ బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణ రావు పిడతల రామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు డోకుపర్తి సుబ్బారావు,బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, పగడాల నరేందర్, మంచికంటి నరేష్, నందిగామ రాజ్ కుమార్, పాలకుర్తి కృష్ణ, కోడి రెక్క ఉమాశంకర్, పద్మాచారి, ఆవుల అశోక్, శ్రీనివాస్, యూన్సీ, పుల్లయ్య, ఆజాద్, వరదా నరసింహారావు, సైదా, చామకూరి వెంకన్న, చెరుకుపల్లి నాగేశ్వరరావు, మిర్యాలనాగరాజు,బత్తిని మధు గౌడ్, ఆసిఫ్,బురాన్,కొరివి ధనలక్ష్మి, రమాదేవి ,అశోక్ సింగ్, స్రవంతి, పుప్పాల రేణుక తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు పై పరువు నష్టం కేసు కొట్టివేత

కారేపల్లి జనవరి 2: కారేపల్లి మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బీమవరం శ్రీనివాస్‌రావుపై నమోదైన పరువునష్టం కేసును కొట్టివేస్తు మంగళవారం ఖమ్మం 3వ అదనపు జ్యాడిషయల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి వినుకొండ మాధవి తీర్పుచెప్పారు. జర్నలిస్ట్ తరుపున న్యాయవాది నర్సింగ్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొత్తకమలాపురం గ్రామంలలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విచారణకు సంబంధించి 2010 ఓ దినపత్రికలో వార్తప్రచరితమైంది. ఈవార్తపై గ్రామానికి చెందిన ఓ మహిళ కోర్టులో ప్రవేట్ కంప్లయింట్ ద్వార స్థానిక పోలీసు స్టేషన్‌లో పరువునష్టం కేసు నమోదు చేయించారు. ఈకేసులో వాదనలు విన్ననాయ్యమూర్తి సరైన ఆధారాలు లేనందున కేసు కొట్టివేస్తున్నట్లు తీర్పు వెల్లడించారు.

ఉపసర్పంచ్‌కు తెలియకుండా రూ. 4 లక్షల డ్రా

» సర్పంచ్, కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు » విచారణకు ఆదేశించినా ఖాతరు చేయని అధికారులు


పెనుబల్లి, జనవరి 2: పెనుబల్లి మండలం కర్రాలపాడు గ్రామపంచాయతీలో 15వ ఆర్థికసం ఘం ద్వారా మంజూరైన నిధులకు తనకు తెలియకుండా సర్పంచ్, కార్యదర్శి కలిసి వోచర్‌లు బిల్లులు పెట్టి రూ.3.92లక్షలు డ్రా చేశారని ఉపసర్పంచ్ ఆళ్ల కృష్ణయ్య ఆరోపించారు. ఈ నిధులకు సంబంధించి సర్పంచ్, కార్యదర్శిని ఎన్నిసార్లు సంప్రదించినప్పటికీ సమాధానం, లేదని మండల అధికారులను సైతం తాను సంప్రదించానని ఫలితం లేకపోవడంతో గతనెల 8న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని ఉపసర్పంచ్ కృష్ణయ్య తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారికి వారంరోజుల్లో దీనికి సంబంధించి విచారణ జరిపి వివరాలు తెలియజేయాలని ఆదేశించారని కానీ ఇప్పటివరకు అధికారులెవరూ గ్రామంలో విచారణ జరపలేదని కృష్ణయ్య తెలిపారు. గ్రామంలో పనులు చేసినట్లు కాగితాల్లో చూపించటం తప్ప ఆపనులు చేయలేదని కానీ ట్రాక్టర్ ఈఎంఐ రూ.53,585 లాంటి కొన్ని నిధులు సక్రమంగా వినియోగించినప్పటికీ డ్రా చేసిన నిధులు పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయ్యాయని కృష్ణయ్య ఆరోపిస్తున్నారు. ఆనిధులతో గ్రామంలో సిబ్బందికి జీతాలు రూ.85వేలు, శానిటేషన్ పనులకు రూ.5400, ట్రాక్టర్ రిపేర్లకు రూ.47,750, చేతిపంపు రిపేరు కోసం రూ.30వేలు, పల్లెప్రకృతివనం, తాగునీటి పైపులైన్ల లీకులు, బ్లీచింగ్ పనులు నిర్వహించినట్లు ఉపసర్పంచ్ సేకరించిన వివరాలను తెలియజేశారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై జిల్లా ఉన్నతాధికారు లు విచారణ జరిపితే మరిన్ని అవకతవకలు బయటపడతాయని ఉపసర్పంచ్ తెలిపారు.

జిల్లా అధికారులు విచారణకు రాలేదు: ఎంపీవో

కర్రాలపాడు గ్రామపంచాయతీలో తనకు తెలియకుండా నిధులు డ్రాచేశారని ఉపసర్పంచ్ కృష్ణయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయమై 'ఆంధ్రజ్యోతి' ఎంపీవో వాల్మీకి కిషోర్‌ను సంప్రదించగా అధికారులు ఇంతవరకు విచారణకు రాలేదని తెలిపారు.

మణుగూరు ఏరియా ఆసుపత్రి డాక్టర్ కన్నుమూత

» ఆసుపత్రిలో తొలి ఆపరేషన్‌ను చేసిన ఘనత ఆయనదే..



డాక్టర్ ఆనందరావు (ఫైల్)

మణుగూరుటౌన్, జనవరి 2: మణుగూరు వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ గైనకాలిజిస్ట్ డాక్టర్ ఆనందరావు (72) గుండెపోటుతో మృతి చెందారు. ఏరియా ఆసుపత్రిలో రెండు సంవత్సరాలు ఆసుపత్రిలో విశిష్ట సేవలందించి డాక్టర్ ఆనందరావు పదిహేను రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో తన స్వగ్రామమైన ఏపీలోని చిత్తూరు జిల్లా వుంగనూరు వెళ్లారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు ఏరియా ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. కాగా మణుగూరులో నిర్వహించిన సంతాప సభలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సిబ్బంది. జిల్లా కో ఆర్డినేషన్ హస్పిటల్స్ సర్వీస్ అధ్యక్షుడు డాక్టర్ రవిబాబు డాక్టర్ ఆనందరావు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి నివాళ్లు అర్పించారు.

డాక్టర్ ఆనందరావు సేవలు చిరస్మరణీయం..

మణుగూరు ప్రభుత్వ వందపడకల ఏరియా ఆసుపత్రి చరిత్రలో డాక్టర్ ఆనందరావు తొలి సిజేరియన్ ఆపరేషన్, తొలి ట్యుబెక్టమి ఆపరేషన్, తొలి గర్బసంచి తొలగింపు ఆపరేషన్‌లను చేశారు. ఎటువంటి గైర్హాజరుకు అవకాశమివ్వకుండా ప్రతీ రోజు క్రమం తప్పకుండా 50 నుంచి 60 మందికి తగ్గకుండా రోగులకు ఓపీ ద్వారా పరీక్షించి వైద్య చికిత్సలు చేసేవారు. 2022లో ఏరియా ఆసుపత్రిలో 79, 2023లో 366 డెలివరీలు ఎటువంటి ఆపరేషన్ లేకుండా చేశారు. రెండేళ్ల సర్వీసులో 289 ట్యుబెక్టమి, సిజేరియన్ 245 ఆపరేషన్‌లతోపాటు గర్బసంచి తొలగింపు ఆపరేషన్ ఒకటి చేశారు. సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. రోగులకు అందించిన సేవలు తోటి వైద్య సిబ్బందికి సహ కరించిన దైర్యంగా వెన్నంటి ఉన్న డాక్టర్ ఆనందరావు సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు

గోదావరి తీరం.. నిత్య అగ్నిహోత్రం

- డంపింగ్ యార్డు లేక దశాబ్దంగా అవస్థలు
- భద్రాద్రిలో సేకరించిన చెత్త గోదారమ్మ ఒడిలో డంప్
- ముందుకు సాగని చెత్త వేరు చేసే ప్లాంటు పనులు

ఆంధ్రజ్యోతి పరిశీలన


చెత్తను కాల్చుతున్న దృశ్యం (ఫైల్)


గోదావరి ఒడ్డున డంపింగ్ యార్డు

భద్రాచలం, జనవరి 2: గోదావరి తీరం.. నిత్య అగ్నిహోత్రం. ఇది ఆశ్చర్యం అనిపించినప్పటికీ ఇది ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భద్రాచలంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను ఇక్కడే డంపింగ్ చేస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని కూనవరం, చింతూరు, వరరామచంద్రాపురం, భద్రాచలం మండలాలు(భద్రాచలం గ్రామ పంచాయతీ మినహాయించి) ఏపీ పరిధిలోకి పోలవరం ముంపు పేరుతో కలిపారు. దీంతో పట్టణంలో డంపింగ్ యార్డుకు జాగా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయంపై గత రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరించకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారిందని భద్రాద్రి వాసులు పేర్కొంటున్నారు. దశాబ్దంగా డంపింగ్ యార్డు లేని కారణంగా భద్రాచలంలోని 20 వార్డుల్లో సేకరించిన చెత్తను గోదావరి వరద కరకట్టపై నుంచి గోదావరిలో చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో ప్రతి రోజు సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తా చెదారాన్ని వేసి కాల్చడంతో పొగతో కూడిన మంటలు వస్తున్నాయి. ఫలితంగా పట్టణంలోని అంబాసత్రం, చప్టా దిగువ, రాజవీధి, ముదిరాజ్‌బజారు తదితర ప్రాంత వాసుల అవస్థలు అంతాఇంతా కాదు. ముఖ్యంగా రామయ్య దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు సైతం ఈ సమస్య తప్పడం లేదు. ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి దాదాపుగా ప్రతి నిత్యం పొగతో కూడిన మంటలు ఎగసిపడుతుండటంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు పట్టణంలోని 20 వార్డుల్లో ప్రత్యేక వాహనాల ద్వారా తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. ఈ చెత్తను మొత్తంగా గోదావరి తీరంలో డంప్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో పందులు స్వైర విహారం చేయడంతో పాటు వర్షాకాలంలో దుర్వాసన వెలువడుతోంది. అలాగే దోమలు సైతం స్వైర విహారం చేస్తున్నాయి. ఫలితంగా ఈ ప్రాంతలో వారు తరచూ ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, గతంలో పట్టణ వాసులు ఈ చెత్త సమస్య పరిష్కరించాలని ఉన్నతాధికారులు వినతిపత్రాలు కూడా అందజేశారు..

ముందుకు సాగని ప్లాంటు పనులు

పట్టణంలో వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు ఒక ప్లాంటును ఏర్పాటు చేసేందుకు గతంలో అధికారులు చర్యలు చేపట్టారు. ఇందు కోసం రూ.1.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో సుందరయ్యనగర్ కాలనీలో 8.50 ఎకరాల్లో పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. ఈ సమయంలో రూ.35 లక్షలతో ఫెన్సింగ్, ఫ్లాట్‌ఫారాన్ని రూ.45 లక్షలతో నిర్మించారు. షెడ్ల నిర్మాణానికి రూ.45 లక్షలు, హౌజ్‌ల నిర్మాణానికి రూ.35 లక్షలతో పనులు చేపట్టాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇంతకు ముందు ఈ ప్లాంటు పనులను చేపట్టేందుకు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ అర్ధాంతరంగా నిష్క్రమించడంతో ఆరు నెలలకు పైనే పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా ఉంది. అయితే సాధ్యమైనంత త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులను పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. దీని ద్వారా గ్రామపంచాయతీ ద్వారా ఆదాయం సైతం పెరుగుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇందుకు సంబంధించిన పనులు ఎప్పుడు పూర్తవుతాయో అనేది వేచి చూడాల్సి ఉంది


గోదావరి ఒడ్డున పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

సాగు నీటిని వృథా చేయొద్దు

- రైతులకు తుమ్మల నాగేశ్వరరావు పిలుపు
- వ్యవసాయ మంత్రిగా తొలిసారి తన పంటపొలాల సందర్శన

దమ్మపేట, జనవరి 2: సాగునీటిని వృథా చేయొద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆయన మంగళవారం దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తన వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈవిషయం తెలుసుకున్న రైతులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల నాగేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా పేరుపేరున తుమ్మల వారిని పలకరించారు. రైతులతో తుమ్మల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా పామాయిల్ తోటలు ఉన్నాయని, రైతులు అధికంగా నీరు పెట్టడం వల్ల దిగుబడులు పెరగవన్నారు. అనంతరం తన కోసం ఎవరు పని చేశారో తెలుసని, అందరినీ గుర్తు పెట్టుకుంటానన్నారు. అనంతరం నీటిపారుదలశాఖ ఈఈ సురేష్ కుమార్ తుమ్మలను కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా గండుగులపల్లిలో బుధవారం నిర్వహించనున్న సీతారామ ప్రాజెక్టుపై సమీక్షకు అన్ని ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ ముజాహిద్, ఎస్సై రవికుమార్‌లు తుమ్మలను కలిసి అభినందనలు తెలిపారు. అంతకు ముందు పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, దొడ్డా ప్రసాద్, బండి భాస్కర్, కాసాని నాగప్రసాద్ ఎర్రా వసంతరావుతో కలిసి తుమ్మల తన వ్యవసాయ క్షేత్రాల్లో కలియదిరిగారు. తుమ్మలను కలిసిన వారిలో మార్కెట్‌కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కొయ్యల అచ్యుతరావు, సొసైటీ డైరెక్టర్ ఎల్లిన రాఘవరావు, మురళీ, కేవీ సత్యనారాయణ, కోటగిరి సత్యంబాబు, ఎర్రగొర్ల రాధాకృష్ణ, మారిబోయిన హరిబాబు, పొన్నగంటి వెంకయ్య, తుమ్మల శేషుబాబు, బడే ఉన్నారు.


తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎక్సైజ్ అధికారులు

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి2: 'జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపాలి. కేసుల నమోదులో సమ్‌థింగ్ సమ్‌థింగ్ అని నమోదు చేయకూడదు. గంజాయి కేసులను క్లియర్‌గా నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎక్సైజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ నాగేంద్ర రెడ్డి, సీఐ రాజు మర్యాదపూర్వకంగా మంత్రి తుమ్మలను కలిసి పుష్పగుచ్ఛాలను అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి ఖమ్మానికి గంజాయి రవాణా జరుగుతోందని, నామమాత్రపు కేసులు నమోదు చేయటం ద్వారా గంజాయి అదుపులోకి రావటం లేదన్నారు. మంచి భవిష్యత్ ఉన్న యువత గంజాయి మత్తుకు అలవాటు పడి చెడిపోతున్నారని తుమ్మల పేర్కొన్నారు. గంజాయిని అరికట్టాల్సిన బాధ్యత ఎక్సైజ్‌శాఖపైనే ఉందని తుమ్మల ఆదేశించారు.


తుమ్మలకు అభినందనలు తెలుపుతున్న ఐబీ ఈఈ


రైతులు, నాయకులతో మాట్లాడుతున్న తుమ్మల


ప్రజాపాలన వేదిక వద్దకు వచ్చిన విద్యార్థులు

ప్రభుత్వ బడుల్లో ప్రజాపాలన సభలు

ప్రార్థన సమయానికి కనిపించని విద్యార్థులు
ఫోన్ చేసి పాఠశాలకు రప్పించిన ఉపాధ్యాయులు

రఘునాథపాలెం, జనవరి 2: ప్రభుత్వ బడిలో టెంట్లు హంగామా చూసి న విద్యార్థులు గైర్హాజరయ్యారు. విషయం గమనించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు 'బడుంది మీ పిల్లల్ని బడికి పంపండి' అంటూ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పిలిపించుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రఘునాథపాలెం మండలంలో జరిగింది. రఘునాథపాలెం, వీ వెంకటాయపాలెం, గణేశ్వరం, చింతగుర్తి ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ప్రజాపాలన సభలు నిర్వహించారు. సాధారణంగా పాఠశాలలకు సెలవు ఉన్న రోజుల్లో మాత్రమే కార్యక్రమాలకు అనుమతిస్తారు. మంగళవారం రఘునాథపాలెం పాఠశాల ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులకు విద్యార్థులు కనిపించలేదు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి బపిల్లల్ని పంపాలని వరసపెట్టి ఫోన్లు చేశారు. ఎట్టకేలకు 126 మంది ఉన్న ప్రాథమిక పాఠశాలకు 70మంది విద్యార్థులు, 17మంది చిన్న పిల్లలున్న అంగన్‌వాడీ కేంద్రానికి 10 మంది మధ్యాహ్నం వరకు చేరుకున్నారు. ప్రజాపాలన సభకు వచ్చిన గ్రామస్థులు తరగతి గదుల వద్దనే దరఖాస్తులను నింపారు. ఈ విషయంపై రఘునాథపాలెం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరాగా కలెక్టర్ అనుమతి మేరకే ప్రభుత్వ బడిలో ప్రజాపాలన సభ ఏర్పాటు చేశామన్నారు.


విద్యార్థులకు సమీపంలో దరఖాస్తులు పూర్తి చేస్తున్న వ్యక్తి

రాష్ట్ర మంత్రులను కలిసిన అటవీశాఖ అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి2: రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మంలో జిల్లా అటవీశాఖ అధికారులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డీఎఫ్వో సిద్ధార్థవిక్రమ్‌సింగ్, ఎఫ్‌డీవో డీ బాబు, ఎఫ్ఆర్వో రాధిక ఇరువురు మంత్రులకు జ్ఞాపికలను అందించారు.


పొంగులేటికి జ్ఞాపిక అందజేస్తున్న అటవీ శాఖ అధికారులు

రహదారి.. జాగ్రత్త బాటసారి

అధ్వానంగా అన్నారుగూడెం-జన్నారం రోడ్డు
నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు

తల్లాడ, జనవరి 2: రెండు నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలకు వారధిగా ఉన్న అన్నారుగూడెం-జన్నారం రహదారి అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉంది. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండలం అన్నారుగూడెం నుంచి వైరా నియోజకవర్గంలోని ఏన్కూరు మండలం జన్నారం గ్రామాల మధ్య ఐదుకిలోమీటర్లకుపైగా రహదారి ఉంది. ఈ రహదారిలో అన్నారుగూడెం, బాలపేట, జన్నారం గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. వ్యవసాయ పనుల కోసం నిత్యం రైతులు, కూలీలు రాకపోకలు చేస్తుంటారు. ప్రస్తుతం రహదారికి ఇరువైపులా దట్టంగా కంపచెట్లు పెరగడంతో మూసుకుపోయింది. మోకాలులోతు గోతులు, మొనదేలిన రాళ్లతో నడవటానికి కూడా ఇబ్బందిగా ఉంది. రహదారి మధ్యలో బాపడు వాగు ఉంది. కొద్దిపాటి వర్షం కురిసినా రహదారి బురదమయం అవుతుంది. ఈ రహదారిలోనే వైకుంఠధామం కూడా ఉండటంతో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు వెళ్లాలన్నా నరకయాతన పడాల్సి వస్తుంది.


ఇదీ అన్నారుగూడెం-జన్నారం రోడ్డు దుస్థితి


రోడ్డుపై భారీ గుంతలు

రహదారిని అభివృద్ధి చేయాలి

పులి వెంకటనర్సయ్య, రైతు, అన్నారుగూడెం



అన్నారుగూడెం-జన్నారం రహదారి రెండు నియోజకవర్గాల గ్రామాలకు వారధిగా ఉంది. అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారైంది. పొలాలకు వెళ్లాలంటే రైతులు, కూలీలు నిత్యం నరకయాతన పడుతున్నారు. రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.



పెనవేసుకున్న పచ్చటి బంధం

తల్లాడ-భద్రాచలం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో ఇరువైపులా భారీ మర్రి వృక్షాలు పెనవేసుకున్నాయి.ఐఎంఎల్ గోడౌన్ సమీపంలో తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ మర్రి వృక్షాలు కొమ్మలు పెనవేసుకొని పొదరిల్లును తలపిస్తున్నాయి. -తల్లాడ

రహదారిపై మరమ్మతులు ప్రారంభం



ఎక్స్‌కవేటర్‌తో గుంతలను పూడ్చుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుమ్ముగూడెం, జనవరి 2: చెరుపల్లి-రామచంద్రునిపేటల మధ్య ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి సైడ్‌బర్మ్ మరమ్మతు పనులు మంగళవారం మొదలయ్యాయి. ఈ రెండు గ్రామాల మధ్య కేబుల్ పనులు నిర్వహించే కాంట్రాక్టరు రహదారి అంచుల వెంట ఇష్టారీతిన తవ్వడం, సరిగ్గా పూడ్చకపోవడంతో వాహనదారులు కొద్దిరోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఈనెల 2న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్ ఎక్స్‌కవేటర్ సాయంతో సైడ్‌బరమ్స్‌ను పూడ్చించారు. మొదటి రోజున పని కొంతశాతం మాత్రమే జరిగిందని, బుధవారం పూర్తవుతుందని డీఈ తెలిపారు. మిగిలిన కేబుల్ పనులకు ఆర్అండ్‌బీ రహదారి పక్కన తవ్వడానికి వీల్లేదని కాంట్రాక్టర్‌ను హెచ్చరించామన్నారు.

మిర్చి@రూ. 23,600

ఖమ్మం మార్కెట్, జనవరి 2: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మార్కెట్‌లో వానాకాలం (ఖరీఫ్) సీజన్ తేజా రకం మిర్చితో పాటు గతేడాదికి చెందిన ఏసీ మిర్చికి ఒకే రకమైన ధరలు లభించడం విశేషం. మార్కెట్‌లో మంగళవారం తేజా రకం సాధారణ మిర్చి(నాన్ ఏసీ)ని క్వింటాల్ రూ. 23,600 ల జెండాపాట ధరకు వ్యాపారులు కొనుగోలు చేయగా కోల్డ్‌స్టోరేజీల లో నిల్వ ఉన్న ఏసీ మిర్చిని సైతం క్వింటాల్ రూ. 23,600 లకు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో మిర్చి పంటకు కొంత కాలంగా నిలకడైన ధరలు లభిస్తుండగా పత్తి ధర సైతం క్వింటాల్‌కు రూ. 6600 ల నుంచి రూ. 6,800 ల వరకు దక్కుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది మిర్చి పంట క్షేత్రాలలో నల్ల తామర పురుగు, వైరస్, ఎరుపు రంగు తెగుళ్ల నేపథ్యంలో పంట దిగుబడి తగ్గినప్పటికీ మార్కెట్‌లో ప్రస్తుతం దక్కుతున్న ధరలతో మిర్చి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మిర్చితో పాటు, మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలలో పండిన తేజ రకం మిర్చికి ప్రధానంగా చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలలో డిమాండ్ ఉంటుంది. ఆయా దేశాలకు ఎగుమతులు ఎక్కువగా ఉంటే ధరలు పెరుగుతాయని. రానున్న రోజుల్లో మిర్చి ధరలు కొంత మేర పెరగొచ్చని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.



నేడు 116 ప్రాంతాల్లో గ్రామసభలు: కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్,జనవరి2: ప్రజాపాలన కార్యక్రమం ఐదోరోజు బుధవారం జిల్లాలోని 21 మండలాలు, నాలుగు మునిసిపాలిటీల పరిధిలో 116 ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మండలం, గ్రామాల్లో మునిసిపాలిటీల్లో గ్రామసభలను నిర్వహిస్తోన్నట్లు చెప్పారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం మునిసిపాలిటీల్లో ఉదయం 33వ డివిజన్ గాంధీనగర్, 34వ డివిజన్ రంగనాయకుల గుట్ట, 35వ డివిజన్ మోతీనగర్, 36వ డివిజన్ గాంధీచౌక్, 37వ డివిజన్ కమాన్‌బజార్, 38వ డివిజన్ ఖిల్లా బజార్, టీకే బజార్, 39వ డివిజన్ మేదర బజార్, 40వ డివిజన్ మోమినాన్ బజార్, 42వ డివిజన్ రాతిదర్వాజా, నిజాంపేట ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కూడా ఇవే ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

తిరుమలాయపాలెం, జనవరి2: ప్రభుత్వ ఆసుపత్రిలకు వచ్చే రోగులకు మరిన్ని వైద్యసేవలందించాలని అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలోని స్థానిక వైద్యవిధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రి ఆవరణ పరిశీలించారు. రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పనిచేసే సిబ్బంది విధినార్వాహణలో అలసత్వం వహించకుండ ఆసక్రమంగా పనిచేయాలని లేకపోతే శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యసిబ్బంది స్థానికంగా ఉంటూ విధులకు సక్రమంగా హాజరుకావాలన్నారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాలతి, మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, వైద్యులు రామారావు,పావని, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తల్లాడ, జనవరి2: మండల పరిధిలోని పినపాక ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజేష్ తెలిపారు. పినపాక ఫీడర్ పరిధిలోని రెడ్డిగూడెం, మంగాపురం, గొల్లగూడెం, అంబేద్కర్‌నగర్ గ్రామాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

తల్లాడ, జనవరి 2: తల్లాడలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపీపీ చల్లా రంగయ్య కుటుంబసభ్యులను మంగళవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి పరామర్శించారు. రంగయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యేను స్థానిక మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దగ్గుల రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దగ్గుల నాగిరెడ్డి, వేమిశెట్టి నాగన్న పాల్గొన్నారు.

కవితల పోటీలో రమణమూర్తికి ప్రథమస్థానం

సత్తుపల్లి,జనవరి2:రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కవితల పోటీలో సత్తుపల్లికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం రామిశెట్టి రమణమూర్తి ప్రథమ స్థానం సాధించారు. ఖమ్మంలో మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా బహుమతి అందుకున్నారు.

కుక్కకాటు బాధిత కుటుంబాలకు వైద్యసలహాలు

రఘునాథపాలెం, జనవరి2: ఇటీవల కుక్కకాటుతో గాయాలైన ఇద్దరు చిన్నారులకు మంచుకొండ వైద్యాధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్యసలహాలను అందించారు. రఘునాథపాలెం మండలం వీవెంకటాయపాలెంలో జగ్యతండాలోని ఇద్దరు కుక్క బాధిత చిన్నారుల కుటుంబాలను వైద్యబృందం పరిశీలించారు. వైద్యజాగ్రత్తలు తెలియజేశారు. కుక్కకాటు ఇంజెక్షన్‌లు తర్వాత డోస్‌ల కోసం మంచుకొండ పీహెచ్‌సీకి రావాలని వివరించారు. డాక్టర్ స్వాతి, సీహెచ్‌వో రమాదేవి, ఏఎన్‌ఎం మేడా పుష్పావతి పాల్గొన్నారు.

ఎన్డీ నేత రమణమ్మకు ఘననివాళులు

తిరుమలాయపాలెం, జనవరి2: మండలంలోని తెట్టెలపాడు గ్రామానికి చెందిన ప్రజాపంథా నాయకురాలు తుపాకుల రమణమ్మ (60) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. కాగా ఆమె పార్థీవదేహాన్ని ప్రజాపంథా జిల్లాకార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరావు, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పుసులూరి నరేందర్ నాయకులు నివాళులర్పించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

సత్తుపల్లి, జనవరి1: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జవహర్ నగర్‌లోని సంఘ భవనంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు వీ.చెంచురెడ్డి, యూనిట్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్, నాయకులు ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, రామిశెట్టి సుబ్బారావు, సాంబశివరెడ్డి, మధుసూదనరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కులు అందజేత

ఖమ్మంకార్పొరేషన్,జనవరి2: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు చొరవతో ఇద్దరు అనారోగ్య బాధితులకు ముందస్తు చికిత్సల కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎల్‌వోసీ నిధులు మంజూరయ్యాయి. ఒక్కొక్కరికి రూ.1.50లక్షల వంతున మంజూరుకాగా, సదరు చెక్కులను మంగళవారం నామా క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు అందచేశారు. బీఆర్‌ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్,ఎంపీ కార్యాలయ ఇన్‌ఛార్జ్ కనకమేడల సత్యనారాయణ చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరంపూడి ప్రసాద్, దామ వీరయ్య, చిత్తారు సింహాద్రియాదవ్,చింతలచెరువు లక్ష్మి, నామా సేవాసమితినాయకులు చీకటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ

వైరా,జనవరి2: వైరా గ్రేట్ విజన్‌క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మీ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థి ఆకాష్‌కు ఉన్నత చదువుల నిమిత్తం ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. మంగళవారం వైరాలో అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ముళ్లపాటి సీతరాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు, వరలక్ష్మి, లగడపాటి ప్రభాకర్‌రావు, ఏదునూరి సీతరాములు, వజినేపల్లి చక్రవర్తి, మద్దెల రవి, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, డాక్టర్ కృష్ణచైతన్య, ఉయ్యూరు రామకృష్ణ పాల్గొన్నారు.

పగిడిపల్లి లేఖకు పీఎంవో స్పందన



ఖమ్మంకార్పొరేషన్,జనవరి2: నగరానికి చెందిన తెలంగాణ కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పగిడిపల్లి రాజారావు అడిగిన సమాచారంపై ప్రధాన మంత్రి కార్యాలయం స్పందించింది. ఎన్నికల పారదర్శకత, ఈవీఎం సెక్యూరిటీ గురించి, ఈవీఎంల హాకింగ్, మానిప్యులేషన్ అరికట్టడానికి తీసుకున్న చర్యలు, పేపర్ బాలట్ ఓటింగ్ అమలు గురించి సమాచారం ఇవ్వాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్యాలయానికి రాజారావు లేఖ రాశారు. 2024 లోక్‌సభ జనరల్ ఎలక్షన్స్‌కు సంబంధించి పై సమాచారం ఇవ్వాలని రాజారావు ఆర్‌టీఐ ద్వారా ప్రధాని కార్యాలయానికి లేఖ పంపించారు. ఈ లేఖకు సమాధానం తెలపాలని ప్రధాని కార్యాలయం ఎలక్షన్ కమిషన్‌కు లేఖను పంపించింది.

పలువురి నేత్రదానం

ఖమ్మంకలెక్టరేట్, జనవరి2: అయిన వారిని కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ తమ వారి నేత్రాలను దానం చేసి మరో ఇద్దరికి కంటిచూపును ప్రసాదించారు. ఖమ్మం జిల్లాలో సోమ, మంగళవారం మృతి చెందిన వారి నేత్రాలను వారి కుటుంబీకులు దానం చేశారు. ఖమ్మం నగరానికి చెందిన మిట్టపల్లి వెంకటేశ్వర్లు (74), బండారు పద్మావతి (62), కోమటిరెడ్డి జానమ్మ (77), దోకుపర్తి వీరభద్రరావు (74), తీగల బంజరకు చెందినముత్తబోయిన కోటేశ్వరరావు (90), ఖమ్మం నగరానికి చెందిన సుగ్గల రత్నమ్మ (90), నున్నా రమణ (56), తాళ్లూరి దుర్గాబాయి (80) చనిపోయారు. మృతుల నేత్రాలను వారి బంధువులు, కుటుంబీకులు ఖమ్మంనేత్రనిధికి దానం చేశారుప సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్, వాసన్ నేత్రనిధికి పంపించినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్‌ప పద్మనాభం తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

కల్లూరు, జనవరి2: కల్లూరులోని కేంద్ర సహకార బ్యాంకులో మంగళవారం క్యాలెండర్లను ఆవిష్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, బ్యాంకు మేనేజర్ నాగళ్ల రాణీ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సత్తి పుష్ప, సూపర్‌వైజర్ ఎస్‌కే జానీమియా, బ్యాంకు సిబ్బంది ఎస్‌కే ఖలిద్, భాస్కర్, రైతులు పసుమర్తి మోహనరావు, మాదల వేంకటేశ్వర రావు, ఎస్‌కే కమ్లి, దార్ల నరిసింహారావు, సాంబయ్య పాల్గొన్నారు.

ట్రైటా ఆధ్వర్యంలో..

ఏన్కూరు: తెలంగాణ గురుకుల విద్యాలయ ఉపాధ్యాయ సంఘం ట్రైటా క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ తూడి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు.

ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండాలి

ఖమ్మంచర్చికాంపౌండ్: ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండాలని జిల్లా ముదిరాజ్ సంఘం వ్యవస్థాపకులు కాశబోయిన అనంతరాములు ముదిరాజ్, డాక్టర్ పిట్టల నాగేశ్వరరావు ముదిరాజ్ కోరారు. మంగళవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో ఉన్నాం

- రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మద్దులపల్లి మార్కెట్ పనులపై అసంతృప్తి

ఖమ్మంరూరల్, జనవరి2: ఆరు గ్యారంటీలు అమలుకు చిత్తశుద్ధితో ఉన్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మంగళగూడెంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. కలెక్టర్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ పదేళ్లగా స్వరాష్ట్రంలో ప్రజల కళలు కల్లలైపోయాయన్నారు. చిత్తశుద్ధితో పని చేసేందుకు సీఎం, మంత్రులం కృషి చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతీ దరఖాస్తు కంప్యూటరైజ్ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1.28 లక్షల దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కాగా మద్దులపల్లి మార్కెట్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో రూ.20 కోట్లతో నిర్మిస్తున్న మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ పనులను రెవిన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దులపల్లిలో 5 ఎకరాల్లో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల పనులను మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేఎన్‌టీయూ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కళాశాల నిర్మాణానికి సుమారు వంద ఎకరాల స్థలం కావాలని మంత్రిని జేఎన్‌టీయూ అధికారులు కోరారు. మండలంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుభద్ర, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, చరణ్‌రెడ్డి, బండి జగదీష్, కన్నేటి వెంకన్న, గరికపాటి వెంకట్రావు, తమ్మినేని నవీన్, నాగండ్ల శ్రీనివాస్‌రావు, అంబటి సుబ్బారావు, సుదాకర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు..

క్షతగాత్రుడికి సాయం అందించిన మంత్రి

తిరుమలాయాపాలెం మండలంలో పర్యటన ముగించుకుని వస్తుండగా రూరల్ మండలం, చింతపల్లి గ్రామం సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు డీ కొట్టుకున్నాయి. దీంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇది గమనించిన మంత్రి పొంగులేటి వెంటనే తన కారు ఆపి క్షతగాత్రుడిని వెంటనే 108లో ఎక్కించి ఆసుపత్రికి పంపించారు. దీంతో మంత్రికి స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

ప్రజాపాలన గ్రామసభలో మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం: నిరుపేదలందరికి సంక్షేమపథకాలు అందిచాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగుతుందని పాలకులం కాదుసేవకులమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో ఎంపీడీవో కార్యాలయంలో ఆరుగ్యారంటీలలో భాగంగా ప్రజాపాలన గ్రామసభ జరిగింది. ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం ఈ ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు వందరోజుల్లోనే అమలు చేస్తామన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రజాపాలన గ్రామసభలో వచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని అందుకోసం అధికారులు పార దర్శకంగా పని చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, ఎంపీపీ బోడ మంగిలాల్, జడ్పీటీసీ బెల్లం శ్రీను, జడ్పీసీఈవో అప్పారావు, జేడీఏ విజయలక్ష్మి, నియోజకవర్గ స్పెషలా ఫీసర్ కొండపల్లి శ్రీరామ్, ఎంపీడీవో చుంచు శ్రీనివాస్, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, సర్పంచ్‌కొండబాల వెంకటేశ్వర్లు, చావా శివరామకృష్ణ, రాయల నాగేశ్వరరావు, చావా వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

నిండుకుండలాంటి తెలంగాణను వట్టికుండను చేశారు

కూసుమంచి: అధికారాన్ని అనుభవించేందుకే కేసీఆర్ కుటుంబం తెలంగాణాను వాడుకున్నారని రెవిన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. మంగళవారం కూసుమంచి మండలం ముత్యాలగూడెం గ్రామంలో ప్రజాపాలనలో పాల్గొన్నారు. తెలంగాణ డబ్బుతో విలాసాలు, భోగాలు అనుభవించి సమస్యలు పక్కనపెట్టారని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దరఖాస్తు దారులు సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

సేవకులమే గానీ.. పాలకులం కాదు
మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి: మేము సేవకులుగా ఉంటామే గానీ...పాలకులుగా ఉండబోమని పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంగాపురంతండాలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో పొంగులేటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అభయహస్తం ద్వారా రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించి రూ.6.71 లక్షల కోట్లు అప్పు చేసి ఖజానా ఖాళీ చేసిందన్నారు. .ఇచ్చిన అన్నిహామీలు నూటికి నూరుశాతం అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.

మినీ స్టేడియం నిర్మించాలని కాంగ్రెస్ నాయకుల వినతి

నేలకొండపల్లిలో మినీస్టేడియంను ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి యువజన కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందచేశారు. మంగళవారం మంగాపురం వచ్చిన మంత్రికి యువజన కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి నరేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నగరపాలకసంస్థ కార్యాలయంలోనూ దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంకార్పొరేషన్: ఆరుగ్యారెంటీల దరఖాస్తులను డివిజన్లలోనే కాకుండా నగరపాలకసంస్థ కార్యాలయంలోనూ స్వీకరిస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ గతనెల 28న ప్రారంభం కాగా, ఆరోజే నగరపాలకసంస్థ కార్యాలయంలో హెల్ప్ డెస్కులు ప్రారంభించారు. డివిజన్లలో ధరఖాస్తులు స్వీకరించేందుకు ఖరారు చేసిన తేదీల్లో ఎవరైనా అందుబాటులో లేకుంటే వారు ఇక్కడ దరఖాస్తులు ఇవ్వవచ్చని కమిషనర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. ఆ మేరకు పలువురు నగరపాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్కులలో దరఖాస్తులు అందచేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించే కేంద్రాల్లో రద్దీ ఉన్నప్పుడు నగరపాలకసంస్థ కార్యాలయానికి దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రజలు వస్తున్నారు. దీంతో నగర పాలకసంస్థ కార్యాలయంలోని కేంద్రాల వద్ద కూడా రద్దీ ఏర్పడుతోంది.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన కేసీఆర్

వైరా: తొమ్మిదిన్నరేళ్ళ పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిగులు ఆదాయం కల్గిన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ విమర్శించారు. రూ.17వేల కోట్ల పైచిలుకు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్ల కాలంలో రూ.6.71లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టివేశారని దుయ్యబట్టారు. మంగళవారం మండలంలోని విప్పలమడక, అష్ణగుర్తి, గొల్లెనపాడు గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. అన్నిచోట్ల ప్రజల నుంచి అధికారులకు వస్తున్న దరఖాస్తులను ఎమ్మెల్యే పరిశీలించారు. విప్పలమడకలో నూతన సంవత్సర కేక్‌ను కట్‌చేశారు. ఈ సభల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ, పరిపాలన టీఎం అధికారులు కేవీ.శ్రీనివాసరావు, జ్యోత్స్నదేవి, సర్పంచ్‌లు తుమ్మల జాన్‌పాపయ్య, ఇటుకల మురళీ, కంచర్ల మరియమ్మ, ఎంపీటీసీలు బూర్గు సంజీవరావు, కిలారు లక్ష్మీ, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, మాజీ ఏఎంసీ చైర్మన్లు గుమ్మా రోశయ్య, బీడీకే.రత్నం, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, నాయకులు కట్ల రంగారావు, దాసరి దానియేలు, కట్ల సంతోష్, మచ్చా బుజ్జీ, దేవభక్తిని అర్జున్‌రావు పాల్గొన్నారు. అంతకముందు వైరా రిజర్వాయర్ అలుగుల్లోని గుట్టలపైన ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ ఆలయ అభివృద్ధికి, రహదారి సౌకర్యానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిరిపురం మాజీ సర్పంచ్ మట్టూరి వీరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. మట్టూరి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, పఠాన్ జాన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు సౌకర్యాలు కల్పించాలి
మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్: ప్రజాపాలన కేంద్రాలకు దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని మేయర్ పునుకొల్లు నీరజ కోరారు. మంగళవారం ఆమె నగరంలోని 25,26 డివిజన్లలోని కేంద్రాలను సందర్శించారు. దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. దరఖాస్తుఫారాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలకసంస్థ డీఈలు, ఏఈలు, నాయకుల గోళ్ల వెంకట్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో సత్తుపల్లికే ప్రథమ ప్రాధాన్యం
ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

సత్తుపల్లిరూరల్: జిల్లా మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధిలో సత్తుపల్లికే ప్రథమ ప్రాముఖ్యత ఇస్తారని హామీ ఇచ్చారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా మంగళవారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని 10,11,19వ వార్డులలో నిర్వహించిన గ్రామసభలలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 19వ వార్డులో పలు సమస్యలను గత పాలకులు అమలు చేయలేక పోయారని స్థానికులు ఏకరవు పెట్టారు. జ్యోతినిలయం పక్కన తాగునీటి కోసం ఏర్పాటుచేసిన బోరును మరమ్మత్తులు చేసి చుట్టుపక్కల వారికి అందించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సత్వరమే పరిష్కరించాలని కమీషనర్‌ను ఆదేశించారు.

ఇది రాజకీయ డిబేట్ కాదు

నేను మీ ఆడబిడ్డను.. ఇచ్చినట్లుగానే హామీలన్నీ నెరవేరుస్తామని, ఎప్పుడైనా మా వద్దకు సమస్యల పరిష్కారం కోరి రావచ్చునని, మాకు అధికార దర్పం ఏమీ లేదని ఎమ్మెల్యే రాగమయి స్పష్టంచేశారు. ఇది రాజకీయ డిబేట్ కాదని, ప్రజాపాలన గ్రామసభల ఉద్దేశ్యంపైనే చర్చించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగం చేసే క్రమంలో వైద్య వృత్తిలో 14ఏళ్ల పాటు నేను నిత్యం ప్రజాపాలనలో ఉన్నానని, నాకు రాజకీయ అవగాహన లేదని అనుకోవద్దన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

తల్లాడ: ఆరు గ్యారెంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి కోరారు. మంగళవారం తల్లాడ మండలం నారాయణపురంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభను ఆమె సందర్శించారు. తల్లాడ, ముద్దునూరు, కేశ్వాపురం గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. తల్లాడ గ్రామపంచాయతీ పరిధిలో 2301, ముద్దునూరులో 650, కేశ్వాపురంలో 265చొప్పున మొత్తం 3216దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఎల్‌పీవో వాసిరెడ్డి ప్రభాకర్‌రావు, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, తహసీల్దార్ వి.రవికుమార్, ఎంఈవో పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు

ముదిగొండ: మండలంలోని ఎడవల్లి, గంధసిరి, కమలాపురం గ్రామపంచాయతీల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రామారావు, ఎంపీడీవో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని తీగలబంజర, సాలెబంజర, పెద్దగోపతి, చిన్నగోపతి గ్రామాలలో పరిపాలనా గ్రామసభలు నిర్వహించారు. అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫజల్ హుస్సేన్, ఎంపీడీవో మహాలక్ష్మి పాల్గొన్నారు.

కారేపల్లి:మండలంలో మంగళవారం ఐదు గ్రామపంచాయతీలలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఆరు గ్యారెంటీలలో అవసరమైన వాటికోసం దరఖాస్తులు చేసుకున్నారు. పోలంపల్లి, తొడితల గూడెం, బాజుమల్లాయిగూడెం,గిద్దవారిగూడెంలో జరిగిన సభలలో ప్రజలు దరఖాస్తులు అందచేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



19వ వార్డులో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



నగరపాలకసంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

నేటి తరానికి కట్టా ఆదర్శం

పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే వర్ధంతి

కల్లూరు, జనవరి2: నేటితరం రాజకీయ నాయకులకు మధిర మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు యోధుడు కట్టా వెంకట నరసయ్య ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం పోచవరం, లోకవం గ్రామాల్లో గ్రామస్థుల, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కట్టా మూడో వర్ధంతిని నిర్వహించారు. పోచవరంలో కట్టా విగ్రహానికి రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. పోచవరంలో జరిగిన కార్యక్రమంలో కట్టా కుటుంబ సభ్యులు కట్టా గాంధీ, సత్యం, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, రవికుమార్, విజయ్‌కమార్, సుగుణమ్మ, ధనమ్మ, నాగవేణీ, సీపీఎం నాయకులు ఉమ్మినేని కోటయ్య తాత భాస్కర్‌రావు, ఎంపీపీ బీరవల్లి రఘు, సర్పంచు నంద్రు అన్నపూర్ణ, ప్రజలు పాల్గొన్నారు. లోవరం గ్రామంలో ప్రముఖులు పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కట్టా అభిమానులు, ప్రముఖులు మండెపూడి బసవయ్య, కోలా బ్రహ్మయ్య, సీపీఎం మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరావు, రంగంబంజరు గ్రామ మాజీ సర్పంచు కొమ్మూరి గోవర్ధన్, వైన్ పురం సర్పంచు రావి సూర్యనారాయణ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం.. శిలాఫలకానికే పరిమితం

వైరా, జనవరి2: వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైంది. దాదాపు 28సంవత్సరాల నుంచి ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అద్దెభవనాల్లోనే కొనసాగుతుంది. నిర్మాణం కోసం 2016 జూలై12న అప్పటి ఆర్‌అండ్‌బీ మంత్రి ఇప్పుడు వ్యవసాయ శాఖ మంత్రి అయిన తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అయితే ఇంతవరకు ఈ కార్యాలయ నిర్మాణం శిలాఫలకాన్ని దాటలేదు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు చెందిన రూ.63లక్షలతో వైరా తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి అప్పటి మంత్రి అయిన తుమ్మల శంకుస్థాపన చేశారు. అయితే ఈ కార్యాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలం ప్రజలకు అనువుగా లేదని రోడ్డు పక్కనే స్థలాన్ని కేటాయించి నిర్మాణం చేపట్టాలని అప్పటి తహసీల్దార్‌ను తుమ్మల ఆదేశించారు. అయితే ఆతర్వాత తుమ్మల 2018 వరకు మంత్రిగా కొనసాగినప్పటికీ ఈ కార్యాలయ భవన నిర్మాణానికి ఏ తహసీల్దార్ కూడా అనువైన స్థలాన్ని కేటాయించలేదు. శంకుస్థాపన శిలాఫలకానికే పరిమితమైంది. వైరా, కొణిజర్ల మండలాల స్థాయిలో వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. అప్పట్లో వైరాతోపాటు మిగిలిన ప్రాంతాల్లో శంకుస్థాపనలు చేసిన అనేక భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. వైరా మాత్రం శిలాఫలకానికే పరిమితమైంది. ఇప్పటికైనా ఈ ప్రాంతానికే చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాడు శంకుస్థాపన చేసి ఇప్పుడు వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు అలాగే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకొని ఇప్పుడైనా ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఈ రెండుమండలాల ప్రజలు కోరుతున్నారు.





ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న కార్యాలయం, 2016 జూలై 12న తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేసిన శిలాపలకం

ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి అక్షింతలు

సత్తుపల్లిరూరల్, జనవరి2: సత్తుపల్లికి మంగళవారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలు చేరుకున్నాయి. మునిసిపాలిటీలోని ఎన్టీఆర్ రామాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు పాల్గొనగా శ్రీరామ నామస్మరణతో మారుమ్రోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు చిల్లగుండ్ల వెంకటేశ్వరరావు, మధు, వెంకటరమణ, జూపాటి పాపారావు, అక్కల నర్సిరెడ్డి, కేఎస్‌ఎస్ నాగరాజు, నీరుడు రాజేష్, రామకృష్ణ, శారద, పద్మ, అరుణ, రాధా, కృష్ణవేణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బూడిదంపాడులో పంపిణీ

రఘునాథపాలెం: అయోధ్య రామాలయం నిర్మాణానికి బూడిదంపాడు గ్రామస్థులు గతంలో విరాళాలు సేకరించి పంపారు. దీంతో రామాలయం ప్రారంభోత్సవానికి రావాలని బూడిదంపాడు గ్రామానికి తలంబ్రాలు, ఆహ్వానపత్రికలు, కరపత్రాలు వచ్చాయి. వాటిని తుమ్మలపల్లి నార్సింహారావు ఆధ్వర్యంలో కేలోత్ భద్రు, రత్నా, సంధ్యా మంగళవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.

రాజీవ్‌గృహకల్ప కు అయోధ్య రాములవారి అక్షింతలు

ఖమ్మంరూరల్: మండలం పోలెపల్లి పంచాయితీ పరిధిలోని సత్యనారాయణపురంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి భక్తులు అయోధ్య సీతారామచంద్రస్వామి వారి అక్షింతలను తీసుకుని రాజీవ్ గృహకల్పలోని వీధులలో ఊరేగింపు నిర్వహించారు. కనక దుర్గాదేవి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు రోహిన్‌కుమార్, పుష్పలత, శ్రీదేవి, రాజేశ్వరి, ఉమా, తివేణి, భాను, జ్యోతి, రాధా, లక్ష్మీ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గృహకల్పలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఎన్టీఆర్ నగర్ రామాలయం వద్ద భక్తులు